క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా ఉంటా



బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌

వైరా: బీఆర్‌ఎస్‌ వైరా నియోజకవర్గ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్‌ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ మాజీ ఎమ్మెల్యే బానోత్‌ మదన్‌లాల్‌ అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1,13వ వార్డుల్లో బీఆర్‌ఎస్‌ సభ్యత్వం ఉండి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీ బీమా రూ.2 లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు రవి, సీతారాములు, డేడీకుమారి, మురళీ కృష్ణ, కృష్ణార్జునరావు, బాబు, సత్యంబాబు, కృష్ణారావు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ రేసులో యలగొండస్వామి

ముదిగొండ: ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌ నాగభూషణంపై అవిశ్వాస ప్రక్రియ కొనసాగుతుండగా... ఆయన తర్వాత ఆ పదవి ముదిగొండ మండలానికి చెందిన తుపాకుల యలగొండ స్వామికి దక్కనుందనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడైన ఆయనకు డీసీసీబీ చైర్మన్‌ పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌ నాయకత్వాన్ని పలువురు కోరినట్లు సమాచారం. బీసీ నాయకుడైన యలగొండస్వామి ప్రస్తుతం ముదిగొండ ఎల్‌ఎస్‌సీఎస్‌ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. కాగా, కీలకమైన డీసీసీబీ చైర్మన్‌ పదవి యలగొండస్వామికే దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

దూప దీప నైవేద్య అర్చక సంఘం కార్యవర్గం ఎన్నిక



సత్తుపల్లిరూరల్‌: సత్తుపల్లిలోని జేవీఆర్‌ పార్కు ఎదురుగా గల శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో దూప దీప నైవేద్య అర్చక సంఘం మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యార్లగడ్డ దయానంద్‌(నందు), మండల ఉపాధ్యక్షుడిగా వి.విజయ్‌బాబు, సెక్రటరీగా తిరునగరి పవన్‌కుమార్‌ ఆచార్యులు, కోశాధికారిగా ఆదోని సంతోష్‌బాబుశర్మ, ప్రచార కార్యదర్శిగా శివప్రసాద్‌, గౌరవ సలహాదారులుగా ఉత్పల వెంకటరమణ శాస్త్రి, కిషోర్‌శర్మలను ఎన్నుకున్నారు. నియామక పత్రాలను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవచార్యులు అందించారు.

మిస్ట్‌ కళాశాలలో ముగిసిన వర్క్‌షాపు

సత్తుపల్లిరూరల్‌: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్‌ కళాశాలలో మూడురోజుల పాటు బీటెక్‌, ఎంటెక్‌ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాపు శనివారం ముగిసింది. మెంటర్స్‌కు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ చలసాని హరికృష్ణ, ఎం.హర్షవర్ధన్‌ రెడ్డి, పివి.రామారావు, జాకీర్‌ హుస్సేన్‌, రామచంద్రరావు, రాజేశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల అవతరణ వేడుకలు

వేంసూరు: మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల 74వ అవతరణ వేడుకలు పాఠశల హెచ్‌ఎం బొంతు శ్రీనివాసరావు అధ్యక్షతన పాఠశాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1958–59 ఎస్సెస్సీ మొదటి బ్యాచ్‌కు చెందిన తుంబూరు వెంకటరెడ్డి, మునునూరు వసంతరావు, మోరంపూడి నర్సమ్మ, జగ్గవరపు వెంకటప్పారెడ్డి, అత్తునూరి చెన్నారెడ్డి, దేశిరెడ్డి రంగారెడ్డిలను శాలువాలు కప్పి సన్మానించారు. మురళీ రెడ్డి, టీఎస్‌పీఎస్‌సీమాజీ సభ్యుడు లింగారెడ్డి, వీరాస్వామి, మహేశ్వరరెడ్డి, సునీత, వెంకటప్పారెడ్డి, ప్రభకర్‌రెడ్డి, సంజీవరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేపీఆర్‌ పాఠశాలలో కలర్స్‌ డే

సత్తుపల్లిరూరల్‌: పట్టణంలోని కేపీఆర్‌ గౌతమ్‌ పాఠశాలలో శనివారం చిన్నారులకు కలర్స్‌ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎల్లో(పసుపు) కలర్‌ దుస్తులు ధరించి, బెలూన్స్‌, డ్రాయింగ్‌(బొమ్మలు గీసి) ఎల్లో కలర్స్‌తో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ కిరణ్‌కుమార్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ వెళ్లిన కాంగ్రెస్‌ నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్‌పార్టీ ఖమ్మం ఎంపీ మల్లు నందిని దరఖాస్తు చేస్తున్న సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్‌ నాయకులు కార్లలో శనివారం హైదరాబాద్‌ తరలివెళ్లారు. కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు రమేష్‌బాబు, నాగేశ్వరరావు, మహిళా కాంగ్రెస్‌ మండలాధ్యక్షురాలు ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పేదింటి బిడ్డలు.. క్రీడల్లో మెరికలు

- క్రీడల్లో సత్తా చాటుతున్న మేడేపల్లి విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ



వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులు(ఫైల్‌)



మేడెపల్లి పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సండే స్పెషల్‌

ముదిగొండ: చదువుతో పాటు క్రీడా ప్రతిభలో శభాష్‌ అనిపించుకుంటున్నారు విద్యార్థులు. మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో మేటిగా నిలుస్తున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లి పతకాల పంట పండిస్తున్నారు. నిత్యం పలు క్రీడల్లో శిక్షణ పొందుతూ మెరికలుగా తయారవుతున్నారు. గతకొద్ది సంవత్సరాలుగా విజయపరంపర కొనసాగిస్తున్నారు.

సత్తా చాటిన విద్యార్థులు..

పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బియ్యని కృష్ణయ్య ప్రతి రోజు సాయంత్రం వేళల్లో విద్యార్థులకు పరుగు సాధనతో పాటు వాలీబాల్‌, షూటింగ్‌ బాల్‌, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్‌ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. వారికి ఆయా క్రీడలతో పాటు శారీరక, మానసిక ధృడత్వానికి దోహదపడే యోగాసనాలు వేయించడంలో మెలకువలు నేర్పుతున్నారు. పలువురు విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు, ప్రశంసలు అందుకుంటూ పాఠశాలకు, గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఘనత సాధిస్తున్నారు.

విజయాలు..

షూటింగ్‌బాల్‌: ఇటీవల నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు నేహాల్‌, పాషా, హర్షవర్ధన్‌లు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

లాంగ్‌జంప్‌: జిల్లాస్థాయి పోటీల్లో బయ్యం కీర్తి ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. కీర్తి, వినయ్‌, యువవర్షిణి, ఆనందతీర్థలు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇంకా పలువురు కబడ్డీ, ఖోఖోలో జిల్లాస్థాయి పోటీల్లో రాణించారు.

అథ్లెటిక్స్‌: ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి సబ్‌ జూనియర్‌ 8వ చాంపియన్‌షిప్‌ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు.

పరుగుపందెంలో: 100మీటర్ల పరుగు పోటీల్లో విద్యార్థి ప్రణయ్‌ జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 100మీటర్లు, 600మీటర్ల పరుగుపందెంలో యశ్వంత్‌, ప్రణయ్‌, చందన, నందన్‌ జిల్లాస్థాయిలో పతకాలు సాధించారు.

ఫుట్‌బాల్‌: ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు యువవర్షిణి, కావ్య, యామినిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు.

జాతీయస్థాయికి ఎదగాలి..



మండల, జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్‌, చాంపియన్‌షిప్‌ కైవసం చేసుకోవడమే కాకుండా జాతీయ స్థాయిలో పతకాన్ని సాధించాలనే పట్టుదల, ఆకాంక్ష, ఇవన్నీ పొందడంలో శిక్షణ ఎంతో ఉపయోగపడింది. పూర్తిస్థాయిలో శిక్షణ పొందడంతో చక్కగా వినియోగించుకున్నాం.

– ఎం.యు వర్షిణి, 9వ తరగతి, మేడేపల్లి పాఠశాల

బెస్ట్‌ చాంపియన్‌షిప్‌గా ఎదగాలి..



మా పాఠశాలలో చక్కటి శిక్షణతోనే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు వెళ్లగలిగాం. రాష్ట్ర ఫుట్‌బాల్‌లో, సబ్‌ జూనియర్‌100మీటర్ల లాంగ్‌ జంప్‌లో వరసగా గోల్డ్‌మెడల్స్‌, రెండు సిల్వర్‌ మెడల్స్‌, ఒక కాంస్య పతకాలు పీఈటి కృష్ణయ్య శిక్షణతోనే వచ్చాయి.

– జి.ప్రణయ్‌, 8వ తరగతి

విద్యార్థులు ఇష్టపడాలి..



విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో కూడా ఇష్టపడి ఆడాలి. తల్లిదండ్రులు మంచిగా సహకరిస్తున్నారు. అందుకే విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యం పెంపొందేలా శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటి వరకు పలు క్రీడల్లో 15మందిపైగా నైపుణ్యతతో పతకాలు సాధించారు.

– బియ్యని కృష్ణయ్య, పీఈటీ

కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కల్లూరు/ఎర్రుపాలెం: కల్లూరులోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవ్యకాంత్‌ ఆధ్వర్యంలో, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు లెప్రసీ(కుష్టు) వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బనిగండ్లపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె దావఖాన వైద్యురాలు శ్రీజన్య, మండల వైద్యాధికారి పుష్పలత మాట్లాడుతూ.. సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా రాగి రంగు కలిగి స్పర్శ లేని మచ్చలుంటే, కుష్టు వ్యాధిగా పరిగణనలోకి తీసుకుని పీహెచ్‌సీలోని వైద్యులను సంప్రందించాలని కోరారు. వ్యాధి సోకిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చికిత్స చేయబడుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు 6 నుంచి 12 నెలలలో తగిన మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శ్రీలత, హెల్త్‌ సూపర్‌ వైజర్‌ గుండపనేని రామారావు, విజయశ్రీ, ఎఎన్‌ఎం నాగమణి, ఆశా కార్యకర్త జమలమ్మ, కళాశాల ప్రిన్సిపాల్‌ యస్‌.రమణారెడ్డి, సూపర్‌వైజర్‌ కె.వెంకటేశ్వరరావు, హెల్త్‌ అసిస్టెంట్లు సాయిరెడ్డి, సుధాకర్‌, అశోక్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ మజూర్‌ అహ్మద్‌, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కల్లూరు: కల్లూరు పోలీస్‌ స్టేషన్‌లోనే గత ఏడాది జూన్‌ 30వ తేదీన కొరకొప్పు రామారావును దూషించిన ఆరుగురు వ్యక్తులపై శనివారం కల్లూరు పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ కేసు విషయమై కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కొరకొప్పు రామారావును మంచాల కృష్ణ, నందిగామ ప్రసాద్‌, బొల్లెపోగు పెద్ద రామకృష్ణ, ఉబ్బన వెంకటరత్నం, తేళ్లూరి మల్లయ్య, ఖమ్మంపాటి రమేష్‌లు దూషించారు. రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాకీర్‌ తెలిపారు.

గీత కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముదిగొండ: కల్లు గీత కార్మిక సంఘం హైక్కుల సాధనకు అందరూ కలసికట్టుగా పోరాడాలని కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి మరికంటి శ్రీనివాస్‌రావుగౌడ్‌ అన్నారు. మండలంలోని బాణాపురంలో శనివారం శ్రీకంఠ మహేశ్వరస్వామి దేవాలయం నందు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధనకై కార్మిక సంఘం ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బాణాపురం గీతకార్మికసంఘం సొసైటీ అధ్యక్షుడు మరికంటి రామలింగం గౌడ్‌, సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వట్టికూటీ వెంకటేశ్వర్లుగౌడ్‌, సీనియర్‌ నాయకులు సైదులుగౌడ్‌, మరికంటి వెంకటేశ్వర్లు, వీరబాబుగౌడ్‌, సురుగు నరసింహారావు, బెందు లక్ష్మణ్‌, బెల్లంకొండ శ్రీను, మరికంటి వెంకట్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం విజయవంతం



పశువులకు నట్టల మందు తాగిస్తున్న వైద్యాధికారిని మమత

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని జీడీబీపల్లి గ్రామంలో పశు సంవర్ధకశాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని పశువైద్యాధికారి డాక్టర్‌ కె.మమత ప్రారంభించారు. శిబిరంలో 32 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సం, 24 దూడలకు నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ వెంకటేశ్వర్లు, గోపాలమిత్రలు పి.వెంకటేశ్వర్లు, ధరావత్‌ రవికుమార్‌, డి.హనుమంతు, బి.వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్‌, కృష్ణప్రసాద్‌, అప్పారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అవగాహన..

మధిరరూరల్‌: జాతీయ సేవా పథకంలో భాగంగా పశువులకు వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ పశు వైద్య కళాశాల అధ్యాపక బృందం హైదరాబాద్‌ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రాపురం మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో పెంపుడు జంతువుల వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రొఫెసర్‌ రాధాకృష్ణ, గోపాలకృష్ణ వివరించారు. ఈ సందర్భంగా మధిర సేవా సమితి ఆధ్వర్యంలో పిల్లలకు తీయని పాల పదార్థాలు అందజేశారు. పశు వైద్య సిబ్బంది లక్ష్మణ్‌ రావు, రమేష్‌, సురేష్‌, జాన్‌బీ పాల్గొన్నారు.

అల్పాహారానికి రూ.5 వేలు వితరణ

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల 1995–96 టెన్త్‌ బ్యాచ్‌ విద్యార్థులు శనివారం అల్పాహారానికి రూ.5 వేలు వితరణ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలకు లైబ్రరి పుస్తకాలు, పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రొత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు కుతుబుద్దీన్‌, రాములు, వంశీకృష్ణ, నరేష్‌, నర్సింహారావు, అరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమావేశాలను జయప్రదం చేయండి

మధిర/ఎర్రుపాలెం/తల్లాడ: నేలకొండపల్లిలో ఈ నెల 4న జరిగే టీఎస్‌ యూటీఎఫ్‌ ఖమ్మం జిల్లా స్థాయి విస్తృత కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని శనివారం మధిర, ఎర్రుపాలెం, తల్లాడ మండల అధ్యక్షులు ఏ.వినోద్‌ రావు, బందారు నాగరాజు, కె.శ్రీకాంత్‌, కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, బి.సుధాకర్‌, ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తదితరులు హాజరవుతారని తెలిపారు. నేలకొండపల్లిలోని సీతారామ ఫంక్షన్‌హాల్‌లో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తారని, అనేక తీర్మానాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కస్తూరిబాయి, ఇబ్రహీం, చెన్నయ్య ఉన్నారు.

అన్ని దానాల్లో.. అన్నదానం మిన్న



అన్నదానం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మధిర: అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్‌ కపిలవాయి జగన్‌ అన్నారు. శనివారం వర్తక సంఘం వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి ఆకలి తీర్చే విధంగా ప్రతి శనివారం వర్తక సంఘం శ్రీ వేకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెచ్చ శ్రీనివాసరావు, రామకృష్ణ, బొగ్గవరపు గణేష్‌ పాల్గొన్నారు.

గురువుకు సన్మానం

ఏన్కూరు: ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అభ్యర్థి తన తొలి గురువును సన్మానించి గురుభక్తిని చాటుకున్నాడు. మండలంలోని తూతకలింగన్నపేటకు చెందిన ఇల్లూరి వెంకటేష్‌కు వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్‌ ఆఫీసర్‌ ఉద్యోగం వచ్చింది. దీంతో వెంకటేష్‌ తన చిన్నతనంలో చదువు చెప్పి పునాది వేసిన ప్రైవేట్‌ టీచర్‌ కృష్ణమాచారిని శనివారం శాలువాతో సత్కరించాడు. విద్యార్థులు స్వీట్లు పంపిణీ చేశాడు.

సమరయోధుడు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ముక్కర వెంకట్రామిరెడ్డి (87) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. మృతదేహాన్ని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్‌ కోటా రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్‌ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్‌ శీలం ప్రతాపరెడ్డి, సర్పంచ్‌ కూరపాటి సుందరమ్మ, ఎంపీటీసీ యశోద తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. మృతుని కుమారుడు ముక్కర రామకృష్ణారెడ్డి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సత్తుపల్లి సీనియర్‌ సివిల్‌ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లిటౌన్‌: కేన్సర్‌తో పాటు అనుకోకుండా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి సీనియర్‌ సివిల్‌ జడ్జి పి.అరుణకుమారి అన్నారు. మండల లీగల్‌ సర్వీసెస్‌ ఆథారటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం అంతర్జాతీయ కేన్సర్‌ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో భయంకరమైన క్యాన్సర్‌ వ్యాధి వ్యాపిస్తుందని దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్‌ పరీక్ష చేయించుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికీ కేన్సర్‌ స్క్రీనింగ్‌ టెస్టులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని పుస్కరించుకొని డాక్టర్‌ స్రవంతిని సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ కె.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓ డాక్టర్‌ ఎల్‌.భాస్కర్‌ నాయక్‌, డాక్టర్‌ ఎస్‌.కిరణ్‌కుమార్‌, డాక్టర్‌ శివకృష్ణ, డాక్టర్‌ వినీష్‌కృష్ణ, ఎన్‌ఎస్‌ విజయలక్ష్మి, హ్యూమన్‌ రైట్స్‌ ఫౌండేషన్‌ నిర్వాహకులు డి.దాసు, కె.వెంకట్‌, కె.వెంకటేశ్వర్లు, రుక్మిణి, ఆదూరి మణి, సుజాత, కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్‌ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతకు మెమెంటో, సర్టిఫికెట్‌ అందజేస్తున్న అతిధులు

సత్తుపల్లి: గాంధీ గ్లోబల్‌ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ ప్రతిష్టాన్‌ సహకారంతో రాష్ట్ర సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంఘీకశాస్త్ర టాలెంట్‌ టెస్ట్‌లో సత్తుపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక చైతన్య టెక్నోస్కూల్‌ విద్యార్థులు సీహెచ్‌ భువన్‌సాయి, సీహెచ్‌ దోష్ట పల్లవి జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ వై.మురళీకృష్ణ, సాంబశివుడు, డైరెక్టర్లు సుజాత, రాకేష్‌, రవికుమార్‌, ఏసుబాబు, ఉషా, రాధ పాల్గొన్నారు.

మధిర: తెలంగాణ సోషల్‌ స్టడీస్‌ ఫోరం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాస్థాయి టాలెంట్‌ టెస్ట్‌లో.. మర్లపాడు జెడ్పీహెచ్‌ఎస్‌ తెలుగు మీడియం విద్యార్థి లక్కిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి మొదటి స్థానం సాధించాడు. ద్వితీయ స్థానంలో చిరంజీవి పసుపులేటి నందిని, తృతీయ స్థానంలో చిరంజీవి వడ్డెరపు జయశ్రీ గెలుపొంది.. జిల్లాస్థాయిలో విజయపతాకం ఎగురవేశారు. వీరు విజయం సాధించడంతో హెచ్‌ఎం శ్రీ భీమరాజు, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయిని శ్రీమతి కలువాల రమాదేవి అభినందనలు తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనపరచాలన్నారు. అభినందనలు తెలిపిన వారిలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెకుముఖి పోటీలు



పెనుబల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్‌: సత్తుపల్లిలోని వీవీ విద్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాస్థాయి చెకుముఖి టాలెంట్‌ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు నాగసాయి, ఉపేంద్ర, మౌలాన, షఫిక్‌, భరత్‌చంద్ర జిల్లా స్థాయి బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వంశీకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుబల్లి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముఖి టాలెంట్‌ టెస్టులో వీయంబంజర్‌ లక్ష్యా స్కూల్‌ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. పదో తరగతి విద్యార్థి ఈలప్రోలు ప్రేమ్‌చంద్‌, 9వ తరగతి విద్యార్థి బాదావత్‌ శాంతన్‌, 8వ తరగతి విద్యార్థి దొంకెన నాగబార్గవ్‌లు పాల్గొని జిల్లా 3వ ర్యాంక్‌ సాధించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిని విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఈశ్వర్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

ఒలంపియాడ్‌లో జాహ్నవి టాపర్‌

కల్లూరు: కల్లూరు ప్రతిభ విద్యాలయానికి చెందిన 7వ తరగతి విద్యార్థి జె.జాహ్నవి సత్యశ్రీ ఇండియన్‌ బ్రిలియంట్‌ ఒలంపియాడ్‌లో జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో విద్యాలయం కరస్పాండెంట్‌ డాక్టర్‌ లక్కినేని రఘు, డైరెక్టర్‌ లక్కినేని ప్రసాద్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి



సర్పంచ్‌లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ/పెనుబల్లి: గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన సర్పంచ్‌ల సేవలు మరువలేనివని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పెనుబల్లిలోని లంకాసాగర్‌లో, తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్పంచులు, ఉప సర్పంచుల సన్మాన సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. గ్రామాల్లో ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డ్‌లు ఇలా అనేక రకాల అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. నిస్వార్థంతో సేవలందించిన సర్పంచ్‌లు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ దూపాటి భద్రరాజు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌ రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్‌, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు మందడపు అశోక్‌కుమార్‌, సర్పంచ్‌లు పొట్లపల్లి శంకర్‌, తేజావత్‌ తావు, భుక్యా పంతులీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్‌

కారేపల్లి: ప్రజల్లో వైషమ్యాలు సృష్టించే బీజేపీ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ పిలుపునిచ్చారు. శనివారం కారేపల్లిక్రాస్‌రోడ్డులో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ సీనియర్‌ నాయకుడు షేక్‌ మదార్‌సాహెబ్‌ సంస్మరణ సభకు ఆయన హాజరై.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కారేపల్లి, కామేపల్లి మండలాల సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఏపూరి లతాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత నినాదాలతో మోదీ దేశప్రజలను మోసం చేశారని, గడిచిన 10 ఏళ్లలో కార్పొరేట్‌ శక్తులతో కుమ్మక్కై దేశసంపదను లూటీ చేయించారన్నారు. బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, భారత్‌ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కార్యవర్గ సభ్యురాలు ఏపూరి లతాదేవి, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ యర్రా బాబు, కామేపల్లి, కారేపల్లి మండలాల కార్యదర్శులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, బోళ్ల రామస్వామి, నాయకులు చెరుకూరి నర్సయ్య, వడ్డె వెంకటయ్య, పుచ్చకాయల శ్రీను, ధన్‌రాజ్‌, సుధాకర్‌, బొమ్మల కృష్ణమూర్తి, వెంకటకృష్ణ, భూషయ్య, ధనలక్ష్మి, బిక్షమయ్య, పురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



వైరా: మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా/సత్తుపల్లి/కల్లూరు/కల్లూరురూరల్‌: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్‌ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయాన్ని కాపాడి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఇఫ్టూ జిల్లా నాయకులు ఖమ్మంపాటి పుల్లారావు లతో పాటు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో, సత్తుపల్లిలో జరిగిన కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. అదే విధంగా కల్లూరులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. కల్లూరురూరల్‌లోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెనోటీస్‌ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలైన రైల్వే, విమానయానం, బ్యాంకింగ్‌, ఎల్‌ఐసీ తదితర సంస్థలన్నింటిని కార్పొరేట్‌ సంస్థలకు దారాదత్తం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, గారపాటి అశోక్‌, యలదండి బాబు, సాంబశివరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, మధు, హమాలీ సంఘం నాయకులు ఎన్‌.సీతారాములు, ఎస్‌కే హుస్సేన్‌, వి.నరసింహారావు, బి.వీరాంజనేయులు, జి.గోపాలకృష్ణ, కె.గోవిందరావు, రాము, టి.శేషగిరిరావు, కె.రాము, ఎండీ రఫీ, ఎస్‌కే జాని, నిమ్మటూరి రామకృష్ణ, శరత్‌, యోబు, రామారావు, సర్వేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దయాకర్‌రావు, రమాదేవి, మారెమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.